క్లుప్తంగా

వాజ్‌పేయి విగ్రహావిష్కరణ



వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి తదితరులు

గణపవరం: దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. మంగళవారం గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో రుద్రరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వాజ్‌పేయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఆర్‌వీఎస్ రాజు, హెచ్‌ఎం జి.సత్యనారాయణ, పుప్పాల ప్రకాష్, జి.దేవదాసు, యూటీఎఫ్ నాయకులు హోతా ఆంజనేయులు, బి.రత్నరాజు, బి.రమేష్, కొవ్విడిశర్మ పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేద మహిళలు, వృద్ధులు నూతన వస్త్రాలు అందించిన రిటైర్డ్ ఎంపీడీవో చినకోటయ్య

భీమడోలు: నిరుపేద మహిళలు, వితంతువులు, వృద్ధులకు మంగళవారం రిటైర్డ్ ఎంపీడీవో ఎస్.చినకోటయ్య నూతన వస్త్రాలను అందించారు. భీమడోలు- 4 పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చినకోటయ్య తన భార్య జ్ఞానమ్మ జ్ఞాపకార్థం గ్రామంలోని 100 మంది మహిళలు, పురుషులకు నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బుల్లి దొర, టీచర్లు ఎం.శరీన్, జయశ్రీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల సందడి

- కళకళలాడుతున్న మార్కెట్లు
- కిటకిటలాడిన బేకరీ, స్వీట్లు, పండ్ల దుకాణాలు
- వెలుగులు విరజిమ్ముతున్న ఆలయాలు





గణపవరంలో బిర్యానీ, పలావు దుకాణాల వద్ద రద్దీ

పెదవేగి : నూతన సంవత్సరానికి సరికొత్తగా ఆహ్వానం పలికేందుకు అన్ని రంగాలు వారు ముఖ్యంగా యువతీ, యువకులు సిద్ధమయ్యారు. న్యూఇయర్ శోభతో గ్రామాల్లోని దుస్తులు, ఫ్యాన్సీ, సెల్ దుకాణాలు సందడిగా మారాయి. బేకరీలు, పూలు, పండ్లు, బిర్యానీ షాపులు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. నూతన సంవత్సరం అందాలని కలబోసి కొంగొత్త రూపాలతో ఈ ఏడాది ఆకర్షణీయమైన డిజైన్లలో పుష్పగుచ్ఛాలు, కేక్‌లు, గిఫ్ట్ ప్యాక్‌లు, బొకేలు మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. దుకాణాలన్నీ మంగళవారం సాయంత్రం సమయంలో ఎంతో సందడిగా మారాయి. చూడగానే ఆకట్టుకునేలా మయమరపించే రంగుల్లో మిఠాయిలు, డ్రైఫ్రూట్ ప్యాకెట్లు లభ్యమవుతున్నాయి. వీటి ధర రూ.150 నుంచి రూ.2 వేల రూపాయల వరకు ధర పలుకుతున్నాయి.

గ్రీటింగ్ కార్డులు ఆధునిక రూపం

సాంకేతిక అభివృద్ధి ముఖ్యంగా ఇంటర్‌నెట్, ఈ మెయిల్, యూట్యూబ్, వాట్సప్ ఇలా ఎన్నో ఎలక్ట్రానిక్ మాధ్యమాలున్నప్పటికీ గ్రీటింగ్ కార్డులకు ఆదరణ ఏ మాత్రం తగ్గలేదు. స్నేహితులు, బంధువులకు మనసులోని భావాలను సూటిగా చెప్పడానికి గ్రీటింగ్ కార్డులను కొందరు కొనుగోలు చేస్తున్నారు. లైటింగ్, కేక్‌లు, రంగులు, ఆగి, వెలిగే విద్యుత్ దీపాలతో నేటి మోడ్రన్ కల్చర్‌కు అనుగుణంగా గ్రీటింగ్ కార్డులు సిద్ధమయ్యాయని షాపుల యజమానులు చెబుతున్నారు.

నూతన వెలుగులతో చర్చిలు, ఆలయాలు

నూతన సంవత్సరాన్ని దైవ సన్నిధిలో గడిపేందుకు ప్రజలందరూ క్రైస్తవులు చర్చిలకు, హిందువులు ఆలయాలకు వెళ్లేందుకు సన్నద్ధమయ్యారు. మండలంలోని వేగివాడ, విజయరాయి, పెదవేగి, దుగ్గిరాల, కొప్పాక, పినకడిమి, జానంపేట, ఆర్‌సీఎం చర్చిలు, పలు ఆలయాలు సరికొత్త రంగులు, వివిధ రకాల విద్యుత్ అలంకరణలో తేజోమయంగా వికసిల్లుతున్నాయి.

అట్టహాసంగా వేడుకలు

గణపవరం: పాత సంవత్సరానికి వీడ్కోలు, నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పెద్దాచిన్నా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అట్టహాసంగా సంబరాలు చేసుకున్నారు. గణపవరం మార్కెట్‌లో వెలిసిన బిర్యాని సెంటర్లు, రంగురంగుల ముగ్గులు, పూలబొకేలు, పూలదండలు, పండ్ల దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ యువతులు ఇళ్ల వాకిళ్ల ముందు రంగురంగుల రంగవల్లులతో తీర్చిదిద్దారు.



పెదవేగి : సరికొత్త హంగులతో విక్రయానికి సిద్ధంగా పుష్పగుచ్ఛాలు



పెదవేగి : రంగవల్లులకు రంగులు కొనుగోలు చేస్తున్న యువతులు

గణపవరంలో ప్రధాన రోడ్ల వెంబడి బిర్యానీ, పలావు సెంటర్లు కుప్పతెప్పలుగా వెలిశాయి. అన్ని దుకాణాలు కొనుగోలు దార్లతో కిటకిటలాడాయి. స్వీట్లు, పండ్ల కొనుగోళ్లు అధికంగా జరిగాయి. ఇక మద్యం దుకాణాల వద్ద మందుబాబులు క్యూ కట్టారు. పోలీసులు రోడ్లపై సైరన్ మోగిస్తూ పహారా తిరిగారు.

నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మేలు చేకూరాలి



మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: నూతన సంవత్సరం దెందులూరు నియోజకవర్గ రైతులు, ప్రజలతో పాటు ప్రతి ఒక్కరికీ, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని శాంతి, సమానత్వంతో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మంగళవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి విడుదలైన ఓ ప్రకటనలో ఈ నూతన సంవత్సరం వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతమవుతుందని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ అభిమానులు పార్టీ అభివృద్ధికి మరింతగా కష్టపడి పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధి, బలోపేతానికి, పార్టీ శ్రేణులు నూతనోత్సాహంతో నూతన సంవత్సరంలో తమ పూర్తి సహాయసహకారాలు అందించాలని కోరారు.

రాచూరు రోడ్డు విస్తరణకు చర్యలు

ఉంగుటూరు: జిల్లా కలెక్టరు వెట్రిసెల్వి మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలిసి ఉంగుటూరు మండలంలో పర్యటించారు. ఉంగుటూరు హైస్కూల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి రూ.12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరు, బోరును ఎమ్మెల్యే ధర్మరాజుతో కలిసి కలెక్టరు ప్రారంభించారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్‌కు నిధులు కలెక్టరు మంజూరు చేశారు. రూ.15 లక్షల వ్యయంతో చేబ్రోలు గాంధీనగర్‌లో నిర్మించిన సిమెంటు రోడ్డును కలెక్టరు పరిశీలించారు. ఈ చేబ్రోలు హౌసింగు కాలనీలో ఇళ్ల నిర్మాణాలను కలెక్టరు పరిశీలించారు. రాచూరులో ఆర్ అండ్‌బీ రోడ్డు ఇరుకుగా ఉండటాన్ని పరిశీలించి రోడ్డును విస్తరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. రాచూరు సెంటరును అభివృద్ధి చేయడానికి తీసుకోవల్సిన భూసేకరణ ప్రతిపాదనను రోడ్డు భద్రతా కమిటీకి సమర్పించాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్‌మోషేను ఆదేశించారు. కలెక్టరు వెట్రిసెల్వి, ఎమ్మెల్యే ధర్మరాజుతోపాటు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్ స్పెషల్ వర్క్స్ ఎస్‌ఈ రమణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ త్రినాథ్‌బాబు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ మల్లేశ్వరి, హౌసింగు పీడీ సత్యనారాయణ, ఉంగుటూరు సర్పంచి బండారు సింధు, చేబ్రోలు సర్పంచి లక్ష్మీసునీత, తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు, ఎంపీడీవో రాజ్‌మనోజ్, విద్యుత్, హౌసింగు అధికార్లు పాల్గొన్నారు.



చేబ్రోలులో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టరు సెల్వి, ఎమ్మెల్యే ధర్మరాజు

తెలుగు భాషా వికాసానికి మద్దాల కృషి ప్రశంసనీయం

భీమడోలు: తెలుగు భాషా వికాసం, భాషా పరిరక్షణ కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా పోలసానిపల్లికి చెందిన ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడు మద్దాల పెద్దిరాజును ప్రపంచ తెలుగు రచయితల మహాసభల గౌరవ అధ్యక్షుడు పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మంగళవారం జ్ఞాపికను అందించి ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు. విజయవాడ వేదికగా నిర్వహిస్తున్న ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు మూడు సార్లు మండల ప్రతినిధిగా పెద్దిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగు భాషా వికాస కార్యక్రమాలు, కవి సమ్మేళనాల్లో పాల్గొంటూ, కార్యక్రమాలు నిర్వహిస్తున్న మద్దాల పెద్దిరాజు కృషికి గుర్తింపుగా ఆయనను విజయవాడ వేదికగా ప్రశంసించారు.

జిల్లా సమాఖ్య నూతన పాలకవర్గం ఎన్నిక

పెదపాడు: జిల్లా సమాఖ్య అధ్యక్ష ఉపాధ్యక్షులుగా పూసం గంగాభవాని (బుట్టాయిగూడెం), ఉపాధ్యక్షురాలిగా ఆవుల స్వర్ణకుమారి (మండవల్లి మండలం) ఎన్నికయ్యారు. పెదపాడు మండలంలోని వట్లూరు టీటీడీసీలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో అధ్యక్ష ఉపాధ్యక్షులతో పాటు కార్యదర్శిగా తోట కృపామణి (కొయ్యలగూడెం మండలం) సహాయ కార్యదర్శిగా సయ్యద్ సుల్తానా (ఉంగుటూరు మండలం) కోశాధికారిగా గోళ్ల శాంతకుమారి (ఆగిరిపల్లి మండలం)ని ఎన్నుకున్నారు. వీరితోపాటు జిల్లాలోని అన్ని మండలాలల నుంచి ముగ్గురు చొప్పున పాలక మండలి సభ్యులనను ఎన్నుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాంకర్ పర్సన్లు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

గణపవరం: పదవీ విరమణతో బాధ్యతలు తీరినట్లు భావించకుండా ఉపాధ్యాయులు సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. మంగళ వారం గణపవరం బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేడూరి వెంకట సూర్యనారాయణమూర్తి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద, నిమ్నవర్గాల విద్యార్థులు ఎక్కువగా చదువుతున్నారని, వారందరినీ ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు దాతలు స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని కోరా రు. గణపవరం పాఠశాల అభివృద్ధికి దాతల సహ కారంతో హెచ్‌ఎం మూర్తి చేసిన కృషి అభినందనీయమన్నారు. ఎంఈవో గొర్రెల బాలయ్య, విశ్రాంత ఎంఈవోలు పుచ్చల శేషు, కె.రాంబాబు, వంగపండు నర్సింహామూర్తి, పొత్తూ రి రామకృష్ణంరాజు, సాగిరాజు పెద్దిరాజు, రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్‌వీఎస్ రాజు మాట్లాడారు. ఈ సందర్భంగా సూర్యనారాయణమూర్తి దంపతులను ఎమ్మెల్సీ గోపీమూర్తి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం గంగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థన చేస్తున్న ఫాదర్ పి.బాల ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్

దెందులూరు: ప్రతి ఒక్కరికీ మరింత శాంతి, సౌభ్రాతృత్వం, సేవాభావం దేవుని దీవెనలతో లభించాలని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి.బాల అన్నారు. మంగళవారం సెయింట్ జాన్స్ విద్యాసంస్థల్లో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక దివ్యపూజాబలి నిర్వహించారు. ప్రజలందరి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ సంతోషం, స్వయం ఉపాధిని, సంపూర్ణ ఆరోగ్యం, శాంతి తమ వల్లే ఇరుగుపొరుగు వారిని ప్రేమించే గుణం కలగాలని కోరారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలను, ఆశీర్వాదాలను ఇచ్చారు. అధ్యాపక బృందం, అధ్యాపక విద్యార్థినీ విద్యార్థులకు వికార్ జనరల్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేసి కేక్‌ను కట్ చేశారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

దెందులూరు: ప్రపంచం మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అమానుషంగా వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు గొల్ల వీరాస్వామి, కొంగర రత్న కుమార్, బల్ల విజయకుమార్, పండు, కులవర్తి సంతోష్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ తన మేధా సంపత్తితో భారత రాజ్యాంగం రచించారని అన్నారు. హోంమంత్రి తన తప్పు తెలుసుకుని తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని తప్పు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార దిశగా జనవాణి



జనవాణి కార్యక్రమంలో అర్జీలు అందజేస్తున్న ప్రజలు

ఉంగుటూరు: ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మంగళవారం తన క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు జనవాణికి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని అన్నారు. నియోజకవర్గంలోని డీపీవో అనురాధ, ట్రాన్స్‌కో డీఈ అంబేడ్కర్, ఎంపీడీవోలు రాజ్‌మనోజు, భీమడోలు సత్యవతి, నిడమర్రు ఎంపీడీవో కుమారి, గణపవరం ఎంపీడీవో, తహసీల్దార్లు అప్పారావు, నాగరాజు, ప్రసాదు, సీఐ సుభాష్, ఆర్‌అండ్‌బీ, అధికార్లు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రావులపర్రులో రెవెన్యూ సదస్సు

ఉంగుటూరు: రావులపర్రులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు ప్రసాదు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో పేరుమార్పు కోసం ఒకరు, 1బీ కాపీ కోసం ఒకరు, ఆక్రమణలు తొలగించాలని ముగ్గురు అర్జీలు అందజేశారు. సర్పంచి, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారం రాచూరులో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని తహసీల్దారు తెలిపారు.